Andhra Jyothy    Dt 24/09/18.





### రైళ్ల ఫ్రీక్వెన్సీ పెంచాలి

మెట్రో ప్రయాణం ఎంతో సౌకర్యంగా ఉంది. మెట్రోరైల్ ప్రారంభమైనప్పటి నుంచి నేటికి చాలా మార్పులు జరిగాయి. రైలు స్పీడు పెరిగింది. ప్రయాణాన్ని ఎంతో ఎంజాయ్ చేస్తున్నాం. ఎప్పుడు ఎక్కడ ట్రాఫిక్‌లో చిక్కుకుపోతామనే భయం లేకుండాపోయింది. సమయానికి ఉప్పల్ నుంచి హైటెక్ సిటీలోని ఆఫీస్‌కు చేరుకోగలుగుతున్నాం. ఉదయం, సాయంత్రం వేళల్లో సీట్లు దొరకడం లేదు. ఆ సమయంలో రైళ్ల ఫ్రీక్వెన్సీని పెంచాలి.

-వంశీ, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, ఉప్పల్




# మహా మార్పు



- ఎల్‌బీనగర్ కేంద్రంగా మారనున్న ప్రజా రవాణా వ్యవస్థ
- కారిడార్-1లో నేటి నుంచి పూర్తిస్థాయి రాకపోకలు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): మహానగర ప్రజా రవాణా వ్యవస్థలో మార్పునకు మియాపూర్-ఎల్‌బీనగర్ కారిడార్ నాంది పలకనుంది. నగరానికి ఒక చివరి నుంచి మరో చివరకు 29 కి.మీ మేర మెట్రో రైలు పరుగు పెట్టనుంది. ఇప్పటివరకు మియాపూర్-అమీర్‌పేట 13కి.మీ, నాగోల్-అమీర్‌పేట 17కి.మీ మేర మాత్రమే రాకపోకలు సాగుతున్నాయి. సోమవారం మియాపూర్ నుంచి ఎల్‌బీనగర్ వరకు సేవలు అందుబాటులోకి రానున్నాయి.

నగర శివారు, విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న ఎల్‌బీనగర్ కేంద్రంగా ప్రజా రవాణ వ్యవస్థ కొంత పుంతలు తొక్కనుంది. ఇన్నాళ్లూ ఎల్‌బీనగర్ నుంచి అమీర్‌పేట, కూకట్‌పల్లి, మియాపూర్ వెళ్లాలంటే ఆర్టీసీ బస్సులే పెద్ద దిక్కుగా ఉన్నాయి. ఎంఎంటీఎస్ రైళ్లు కూడా అందుబాటులో లేవు. ఇప్పుడు నగరం మధ్య నుంచి బస్సులు వెళ్లే మార్గంలోనే ఆకాశాన మెట్రో రైళ్లు నడవనున్నాయి. గంట నుంచి రెండు గంటల సమయం పట్టే ప్రయాణం కేవలం 52నిమిషాల్లోనే ముగియనుండడంతో అందరి దృష్టి ఈ వైపు మళ్లింది. ఎల్‌బీనగర్ చుట్టుపక్కల ప్రజలు మెట్రోనే తమ ప్రయాణ సాధనంగా ఎంచుకునేందుకు ఎదురుచూస్తున్నారు.

### ఎల్‌బీనగర్ కేంద్రంగా దూరప్రాంతాలకు...

ఎంజీబీఎస్ నుంచి విజయవాడ వైపు వెళ్లే బస్సులు ఎల్‌బీనగర్‌కు చేరుకోవాలంటే సుమారు 45 నిమిషాల సమయం పడుతోంది. ఇక మెట్రో రైలు ఎక్కితే సులువుగా ఎల్‌బీనగర్ చేరుకుని, అక్కడే బస్సు ఎక్కొచ్చు. ఇప్పటికే ఎల్‌బీనగర్ కేంద్రంగా దూరప్రాంత బస్సులు ప్రయాణికులకు సేవలను అందిస్తున్నాయి. విజయవాడ జాతీయ రహదారితో పాటు నాగార్జునసాగర్ రోడ్డు మీదుగా వెళ్లే వారు ఇదే ఆలోచన చేయనున్నట్లు పలువురు భావిస్తున్నారు.

### రైలు, బస్సు ప్రయాణికులకు అనుకూలం..

నగరంలో మొత్తం మూడు మెట్రో కారిడార్లు ఉండగా, రెండు కారిడార్లలో సగం దూరం మేరకే మెట్రో రైళ్లు సేవలందిస్తున్నాయి. అందులో మియాపూర్-అమీర్‌పేట్, అమీర్‌పేట-నాగోల్ మార్గాలు ప్రస్తుతం వినియోగంలో ఉండగా.. అమీర్‌పేట నుంచి ఎల్బీనగర్ మెట్రో మార్గం సోమవారం అందుబాటులోకి వస్తోంది. కారిడార్-1 ఇదే అతి పెద్ద మార్గం. ఈ రూట్‌లో మియాపూర్ నుంచి ఎల్బీనగర్ వరకు 27 స్టేషన్లు ఉన్నాయి. తాజాగా 16 మెట్రో స్టేషన్ల పరిధిలో నగరవాసులకు మెట్రో సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ మార్గంలో నాంపల్లి రైల్వేస్టేషన్, ఎంజీబీఎస్ ఉండడంతో రైలు, బస్సు ప్రయాణికులకు అత్యంత అనువుగా మారనుంది. మియాపూర్-అమీర్‌పేట-నాగోల్ మార్గంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఉండడం రైలు ప్రయాణికులు కలిసొస్తోంది. ఈ మార్గంలో వెళ్తున్న వారిలో ఎక్కువమంది రైల్వే ప్రయాణికులతోపాటు ఉప్పల్, నాగోల్ ప్రాంతాల వారున్నారు. మెట్రో రాకతో అత్యంత రద్దీ ప్రాంతమైన దిల్‌సుఖ్‌నగర్ రోడ్డుపైనా ట్రాఫిక్ సమస్య తీరనుందని వాహనదారులు భావిస్తున్నారు.

### సిటీ బస్సులపై ప్రభావం

ప్రస్తుతం ఎల్‌బీనగర్ నుంచి మియాపూర్, లింగంపల్లి, పటాన్‌చెరు వరకు ఉన్న మార్గంలో 700 వరకు సిటీ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. నగరంలోనే అత్యంత రద్దీ మార్గమిది. మెట్రో రాకతో సిటీ బస్సులపై ప్రభావం పడే అవకాశముందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రయాణికుల సంఖ్య తగ్గితే ఇతర రూట్లకు ఆయా బస్సులను మళ్లించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రతీ మెట్రో స్టేషన్ నుంచి చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలకు మినీ బస్సులను షటిల్ సర్వీసుల రూపంలో నడపాలని మెట్రో అధికారులు ఆర్టీసీ అధికారులకు సూచించారు.

# మెట్రోనే శరణ్యం..!

- రెండు మార్గాల అనుసంధానంతో మెట్రోకు ఆదరణ
- మొదట్లో ప్రభావం చూపిన టికెట్ ధరలు
- ట్రాఫిక్, పెట్రో ధరల పెంపుతో మెట్రో వైపు మొగ్గు

**రెండు కారిడార్లు.. పరిమిత దూరం వరకే ప్రయాణం.. టికెట్ ధరలేమో అధికం. ఆపై పార్కింగ్ సమస్యలు. ఇతర ప్రజా రవాణా వ్యవస్థలతో కుదరని అనుసంధానం. ఇలాంటి సమస్యలతో మెట్రో మొదట్లో ఆదరణ లేక వెలవెలబోయింది. అట్టహాసంగా జరిగిన ప్రారంభోత్సవం అనంతరం నెల రోజులు జనంతో కిక్కిరిసినా.. ఆ తర్వాత మెట్రో ప్రయాణంపై నగర ప్రజలు ఒకింత అనాసక్తి చూపించారు. కానీ, ఇదంతా గతం.**

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): రోజురోజూ పెరుగుతున్న వాహనాలతో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువవడం, పెట్రో ధరలు ఈ ఏడాదిలో గణనీయంగా పెరగడంతో నగరవాసులు ఆలోచన పడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో మెట్రో ప్రయాణమే మేలనే భావనకు వచ్చారు. గత మూడు నెలలుగా 30 కి.మీ మేర రాకపోకలు సాగిస్తున్న మెట్రో రైళ్లలో ప్రయాణించే వారి సంఖ్య ఊహించని రీతిలో పెరిగింది. మెట్రో ప్రారంభమైన రెండు నెలల తర్వాత రోజుకు సుమారు 40 వేల మంది 45వేల మంది వరకు ఉండగా, క్రమేణా 80, 85వేలు.. ఆ తర్వాత 92 వేల మంది వరకు ప్రయాణించారు. ఈ నెలలో నెలలో ఏకంగా 1.27లక్షల మంది ఒక రోజులో ప్రయాణిస్తుండడం విశేషం.



### దూరప్రాంత ప్రయాణికులే అధికం...

ఎక్కువ దూరం ప్రయాణం చేసే వారే మెట్రోలో ప్రయాణించేందుకు ఆసక్తి చూపారు. మియాపూర్ నుంచి సికింద్రాబాద్, ఉప్పల్, నాగోల్ వైపు వెళ్లే వారంతా అమీర్‌పేట వరకు వచ్చి అక్కడి మరో రైలు మారి తమ గమ్యస్థానాలను చేరుకున్నారు. మియాపూర్ నుంచి అమీర్‌పేట 13 కి.మీ, అమీర్‌పేట నుంచి నాగోల్ 17 కి.మీ దూరం వరకే సాగిన మెట్రో ప్రయాణానికి అమీర్‌పేట ఇంటర్‌చేంజ్ కీలకంగా మారింది. ఇక్కడినుంచే ప్రయాణికులు గమ్యస్థానాలను ఎంచుకున్నారు. 10 నెలల్లో రోజూ 20వేల మంది అమీర్‌పేట వచ్చి, వెళ్తున్నట్లు గుర్తించారు. తాజాగా అమీర్‌పేట నుంచి ఎల్‌బీనగర్ వరకు మెట్రో సౌకర్యం అందుబాటులోకి వస్తుండడంతో మెట్రో ప్రయాణంమరింత సౌకర్యవంతంగా మారనుంది.

### క్రమంగా మెట్రోవైపు...

గ్రేటర్ పరిధిలో రోజుకు 1500కిపైగా కొత్త వాహనాలు రోడ్లమీదకు వస్తున్నాయి. అందుకు అనుగుణంగా రోడ్ల విస్తరణ మాత్రం ఉండడం లేదు. దాంతో ట్రాఫిక్ సమస్య నిత్యకృత్యమవుతోంది. మరోవైపు అడుగడుగునా గుంతలు, ఆపై దుమ్ము, ధూళితో రోడ్ల మీద వెళ్లాలంటేనే భయపడుతున్నారు. నగర రోడ్ల మీద వాహనాల వేగం సగటున 20-30 కిలోమీటర్లకు మించడం లేదు. వాహన కాలుష్యమూ అధికంగా ఉంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో గ్రేటర్‌లో నిర్ణీత సమయంలో గమ్యస్థానం చేరుకోవాలంటేనే మెట్రోతోనే సాధ్యమనే మాట సర్వత్రా వినిపిస్తోంది. అంతర్జాతీయ ప్రమాణాలు, అత్యాధునిక మౌలిక వసతులతో కూడిన మెట్రో రైలు పర్యావరణ హితంగానూ ఉండడంతో నగరవాసులు క్రమంగా మెట్రో బాటపడుతున్నారు.